ప్రణాళికతో సర్వే పూర్తి చేయాలి

మణికొండ మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌



సినీనటుడు సుబ్బరాజు నుంచి వివరాలు సేకరించిన మున్సిపల్‌ మేనేజర్‌, సిబ్బంది

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ఎన్యూమరేటర్‌లు ప్రణాళికతో పకడ్బందీగా కుటుంబ సమగ్ర సర్వే పూర్తి చేయాలని మణికొండ మున్సిపల్‌ కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్‌ కార్యాలయంలో వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఇప్పటి వరకు సర్వే చేస్తున్న విధానం అడిగి తెలుసుకుని తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రోజూ చేయాల్సినన్ని గృహాలు సర్వే చేయలేక పోతున్నామని, దాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్నపుడు ఎదురవుతున్న ఇబ్బందులను ఎన్యూమరేటర్‌లు వివరించారు. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిషనర్‌ వివరించారు. అంతకు ముందు ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 6, 7వ వార్డులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరిస్తే త్వరగా పూర్తి అవుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న సినీనటుడు సుబ్బరాజు ఇంటికి వెళ్లి మేనేజర్‌ శ్రీధర్‌ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్‌లు సర్వేను నిర్వహించారు.



ఎన్యూమరేటర్‌ల సమావేశంలో కమిషనర్‌, మేనేజర్‌లు

కార్తీక పౌర్ణమి వేళలో...

- కిటకిటలాడిన శివాలయాలు
- దీపాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మణికొండ: కార్తీక మాసంలో పరమ పవిత్రమైన పౌర్ణమి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మణికొండలో పార్వతీ రామలిగేశ్వరాలయం, పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం, సెక్రటేరియట్‌ కాలనీ గోల్డన్‌ టెంపుల్‌, మంచిరేవుల మచిలేశ్వరాలయాలలో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున దేవాలయాలకు చేరుకుని ఆకాశ దీపాన్ని దర్శించుకుని ఉసిరి చెట్ల కింద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వెలిగించిన దీపాలతో దేవాలయ ప్రాంగణాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. మణికొండ శ్రీ పార్వతీ రామలింగేశ్వరాలయంలో జ్వాలా తోరణం, స్వామి వారి పల్లికీ సేవ, శివలింగాకారంలో దీపాలను ఉంచి వెలిగించారు. మైహోం అవతార్‌ సమీపంలోని సంకట హర హనుమాన్‌ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు. మణికొండ భాగ్య లక్ష్మి కాలనీలోని దుర్గామాత దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు.



భక్తులతో కిటకిట లాడిన మణికొండ శివాలయం

రాజేంద్రనగర్‌: కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని దేవాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు దేవాలయానికి క్యూ కట్టారు. ప్రత్యేక అభిషేకాలు, పూజ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌, బుద్వేల్‌, ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, శివరాంపల్లి, న్యూ గ్రీన్‌ సిటీ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండి మహిళలు దేవాలయాలకు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. బుద్వేల్‌, రాజేంద్రనగర్‌ దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేడుకగా కార్తీక పౌర్ణమి పూజలు



శంషాబాద్‌ సిద్ధుల గుట్ట సిద్ధేశ్వర స్వామి ఆలయంలో అత్తాపూర్‌ కార్పొరేటర్‌ సంగీత

అత్తాపూర్‌: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం దేవాలయాలు కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. అత్తాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మోండ్ర సంగీతగౌరీశంకర్‌ శంషాబాద్‌ సిద్ధుల గుట్ట సిద్దేశవర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజు దీపాలు వెలిగిస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుందని ఆమె అన్నారు.

అదుపు తప్పి పొదల్లోకి వెళ్లిన కారు

మణికొండ: మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హైదర్‌షాకోట్‌ ప్రధాన రోడ్డుపై జరిగింది. వివరాలివీ... కాశీమందిర్‌ నుంచి లంగర్‌హౌస్‌ వైపు వెళ్తున్న కొత్త మారుతి ఎర్టిగా కారు హైదర్‌షాకోట్‌ వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్క చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారు ముందు భాగంలో పాక్షికంగా దెబ్బతిన్నది. అందులోని బెలూన్‌లు తెరచుకోవటంతో డ్రైవర్‌తో పాటు ముందు కూర్చున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో అటుగా వెళ్తున్న వారు మిన్నకున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వర్గీకరణను విస్మరిస్తే గుణపాఠం తథ్యం



మాట్లాడుతున్న గోవిందు నరేశ్‌, వెంకటస్వామి

రాజేంద్రనగర్‌: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురాకుండా మోసం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి రాజకీయ పతనం ఖాయమని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌, ఎస్‌ఎంఎస్‌పీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌ ఇంజం వెంకటస్వామి మాదిగ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమీక్షా సమావేశాన్ని శుక్రవారం బుద్వేల్‌లోని అరుంధతి కమ్యూనిటీ హాల్‌లో పెంటనోళ్ల నరసింహా మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న గోవిందు నరేశ్‌ మాదిగ, ఇంజం వెంకటస్వామి మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ మీద సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే దేశంలో మొట్ట మొదట స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఎస్సీ వర్గీకరణను లేకుండానే 11062 టీచర్‌ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు రేవంత్‌ రెడ్డి తీవ్ర అన్యాయం చేశాడన్నారు. రేవంత్‌ రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి కావాలనే ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్‌ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌.వై.అశోక్‌ మాదిగద, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్‌ నాయకులు మద్దిలేటి మాదిగ, ఎంఎస్‌పీ మేడ్చల్‌ జిల్లా అధ్యక్షులు కేశపగా రాంచందర్‌ మాదిగ, వికారాబాద్‌ జిల్లా అధ్యక్షులు ఆనంద్‌ మాదిగ, ఎంఎస్‌ఎఫ్‌ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బైరపోగు శివ కుమార్‌ మాదిగ, ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్‌ మాదిగ, వికారాబాద్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ పాల్గొన్నారు.

'ఇగ్నో' ప్లానింగ్‌ బోర్డు మెంబర్‌గా హెచ్‌సీయూ ప్రొ.వెంకటరమణ

రాయదుర్గం: ఇందిరాగాంధీ నేషనల్‌ ఓపెన్‌ యూనివర్సిటీ (ఇగ్నో) ప్లానింగ్‌ బోర్డు సభ్యుడిగా హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ ప్రొఫెసర్‌ వి వెంకటరమణను నియమించారు. మూడేళ్ల కాలపరిమితితో ఆయన విధులను నిర్వహిస్తారు. 'ఇగ్నో' ప్లానింగ్‌ బోర్డు అనేది విశ్వవిద్యాలయం కార్యక్రమాలు, కార్యకలాపాల రూపకల్పనకు బాధ్యత వహించే అపెక్స్‌, ప్రిన్సిపల్‌ బాడీగా కొనసాగుతుంది.

దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: ఏపీజే అబ్దుల్‌ కలాం, సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ జయంతి వేడుకలను డిసెంబర్‌ మొదటి వారంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్‌ హ్యాండ్స్‌ ఆర్గనైజేషన్‌ వ్యవస్థాపకురాలు ఎస్‌.సరోజనమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలోని ప్రతి రంగంలో నిస్వార్థ సేవలు అందిస్తున్నవారిని గుర్తించి సత్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సాహితీవేత్తలు, రచయితలు, సినీనటులతో పాటు వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని పలు అవార్డులతో సత్కరించనున్నామని ఆసక్తిగల వివరాలకు 63029 08528 లో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

మణికొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీకి చెందిన రామ్మోహన్‌కు రూ. 44 వేలు, పుప్పాలగూడకు చెందిన యాదమ్మకు రూ. 44 వేలు, మణికొండకు చెందిన రామకృష్ణకు రూ. 44 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో ఆస్పత్రులలో చికిత్స పొందిన వారికి ఇలాంటి సహకారం అందుతుందన్నారు. ఎవరైనా అలాంటి వారుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్‌ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, జి.నరేందర్‌, శ్రావణ్‌కుమార్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కుమార్‌ పాల్గొన్నారు.

అయ్యప్పలకు నిత్యాన్నదానం ప్రారంభం

అత్తాపూర్‌: అన్ని దానాల్లో అన్నదానం ఎంతో గొప్పదని రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. అత్తాపూర్‌లో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ముద్దగౌనీ భాస్కర్‌గౌడ్‌, ముద్దగౌనీ మల్లికార్జున్‌గౌడ్‌ల సారథ్యంలో అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం (భిక్ష)ను ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 15వ నుంచి డిసెంబర్‌ 15వ తేదీ వరకు నిర్విరామంగా నిత్య అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. రాజేంద్రనగర్‌ యువజన కాంగ్రెస్‌ నాయకులు మహేష్‌గౌడ్‌, జిల్లా కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, బీ-బ్లాక్‌ అధ్యక్షులు ఖాలేద్‌, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు మిద్దెల సురేష్‌రెడ్డి, కావూరి వెంకటేష్‌, రమాదేవి, గోపిగౌడ్‌, శంకరయ్యగౌడ్‌, రవీందర్‌గౌడ్‌, అమరేందర్‌ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

కుస్తీ పోటీల ప్రారంభం



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌

అత్తాపూర్‌: సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ కేసరి కుస్తీ పోటీలు అత్తాపూర్‌ డివిజన్‌ రాంబాగ్‌ మైదానం కేంద్రంగా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కుస్తీ పోటీలను రాజేంద్రనగర్‌ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే కుస్తీ పోటీలలో హైదరాబాద్‌ నగరంలో నలుమూలల నుంచి రెజ్లర్లు పాల్గొన్నారు. కుస్తీ పోటీల కమిటీ చైర్మన్‌, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్‌ ఇన్‌చార్జీ ఎస్‌.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.రాజు పైల్వాన్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రాజేంద్రనగర్‌: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్తు వారు నిర్వహించిన వివిధ పోటీల్లో శివరాంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎస్‌.నరేశ్‌ (8వ తరగతి) చిత్రలేఖనంలో, డి.విష్ణుశ్‌ కథల పోటీల్లో, టి.యశ్విత (8 తరగతి) ఉపన్యాస పోటీల్లో ప్రైజ్‌ మనీతో పాటు సర్టిఫికెట్‌, మెమెంటోలను అందుకున్నారు. బహుమతి పొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.





శిథిలావస్థలో మూసీ వారధి!

- ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు, రెయిలింగ్‌
- పాదచారులకు తప్పని ఇబ్బందులు
- నాలుగు దశాబ్దాలైనా నిర్వహణ ధైవాధీనం
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసన

అత్తాపూర్‌: మూసీ నదిపై హైదరాబాద్‌-రంగారెడ్డి జిల్లాలను కలిపే కీలక బ్రిడ్జి (వారధి) ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. నాలుగు దశాబ్దాల క్రితం నగర శివారులోని అత్తాపూర్‌ వద్ద మూసీ నదిపై నిర్మించిన ఈ బ్రిడ్జి రంగారెడ్డి-హైదరాబాద్‌ జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. నిర్వహణ లోపం, ఫుట్‌పాత్‌ల దుర్వినియోగంతో బ్రిడ్జి దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జికి రెండు వైపులా నిర్మించిన రెయిలింగ్‌ కూడా పూర్తిగా ధ్వంసం అయిపోయింది. బ్రిడ్జికి మరమ్మతులు చేయని పక్షంలో త్వరలో కూలిపోయే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

- బ్రిడ్జి నిర్మించక ముందు నదికి రెండు వైపులా ఉన్న ప్రాంతాల ప్రజల రాకపోకలు ఎంతో ప్రయాసతో కూడుకున్నవిగా ఉండేవి. నదీ ప్రవాహం ఉధృతంగా ఉన్న కొన్ని నెలల పాటు రాకపోకలు దాదాపు ఉండేవి కాదు. అత్యవసరాల్లో ఎవరైనా నది దాటేందుకు సాహసించి పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ లేకపోలేదు.
- అయితే బ్రిడ్జి నిర్మాణం ఆ తరహా ప్రమాదాలను నివారించిందనే చెప్పొచ్చు. ప్రాణ నష్టాన్ని సైతం అడ్డుకుంది. ఇప్పుడు బ్రిడ్జికి రెండు వైపులా ఫుట్‌పాత్‌లపై పాదచారుల కోసం డాంబర్‌ షీట్లను వేశారు. అయితే ఇప్పుడు ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపకరించడం లేదు.
- ద్విచక్ర వాహనాలు వెళ్లే రోడ్డుగా రెండు ఫుట్‌పాత్‌లు మారిపోయాయి. ఫలితంగా అటు నుంచి ఇటు నుంచి వెళ్లే పాదచారులు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పుడయినా నగర పాలక వ్యవస్థ మేలుకోని బ్రిడ్జికి మరమ్మతులు చేయకుంటే అత్తాపూర్‌-హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలకు లోనయ్యే ప్రమాదం పొంచి ఉన్నది.
- నగరానికి చేరుకోవాలంటే కిషన్‌ బాగ్‌ మీదుగా వెళ్లాల్సిందే. మూసీ నది నీటి ప్రభావం లేని సమయంలో మాత్రం తప్పని పరిస్థితుల్లో మూసీ నది నుంచి నడిచి వెళ్లేవారు ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు సౌకర్యవంతం కావడంతో పాటు ఈ ప్రాంత భూములకు మంచి డిమాండ్‌ వచ్చింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఇరువైపులా పాదచారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లను నిర్మించారు.
- వాహనాల భద్రతతోపాటు బ్రిడ్జి పటిష్టత కోసం 15 సంవత్సరాల క్రితం డాంబర్‌ షీట్లను ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై చిన్న చిన్న గుంతలు ఏర్పడ్డాయి. పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై నుంచి ద్విచక్ర వాహనదారుల రాకపోకల కారణంగా బ్రిడ్జికి రెండు వైపులా ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ బ్రిడ్జిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారుతున్నది. ప్రయాణికుల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణాన్ని ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు.





శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన అత్తాపూర్‌ బ్రిడ్జి ఫుట్‌పాత్‌లు

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్‌

- 24 కేసుల్లో నిందితులు
- వివరాలను వెల్లడించిన మాదాపూర్‌ ఏసీపీ శ్రీకాంత్‌



బైక్‌ల చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్‌ ఏసీపీ సీహెచ్‌ శ్రీకాంత్‌

గచ్చిబౌలి: ముసుగులు ధరించి బైక్‌లు చోరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు మాదాపూర్‌ ఏసీపీ సీహెచ్‌ శ్రీకాంత్‌ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న రాత్రిపూట హెల్మెట్‌ ధరించి ఒకరు, ముసుగు వేసుకొని ఒకరు నడుచుకుంటూ వెళ్లి ఎన్‌ఫీల్డ్‌, యమహా బైక్‌లను చోరీ చేసిన విషయం తెలిసిందే. సీసీ ఫుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడిన కిషన్‌బాగ్‌కు చెందిన డ్రైవర్‌ సర్దార్‌ కరణ్‌వీర్‌ సింగ్‌(24), బీకేగూడలో నివాసం ఉండే స్విగ్గీ డెలివరీ బాయ్‌ సర్దార్‌ జాగ్‌ జోత్‌సింగ్‌(23)లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. కారులో వచ్చి ఇద్దరు కారును దూరంగా పార్క్‌ చేసి బైక్‌లను చోరీ చేసి ఉడాయించారు. నిర్మానుష్య ప్రాంతంలో బైక్‌లను ఉంచి తిరిగి కారు తీసుకొని బీదర్‌కు పరారయ్యారు. కరణ్‌వీర్‌ సింగ్‌పై పంజగుట్ట, హుమయూన్‌నగర్‌, బేగంబజార్‌, చిక్కడపల్లి, సంగారెడ్డి టౌన్‌ పీఎస్‌ పరిధిలో ఏడు బైక్‌ చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్నారు. జాగ్‌ జోత్‌సింగ్‌ మియాపూర్‌, మాదాపూర్‌, చందానగర్‌, ఆర్సీపురం, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ పరిధిలో రాత్రి పూట ఇళ్ల తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడిన 23 కేసుల్లో, ఒక ఎన్‌డీపీఎస్‌ కేసులో నిందితుడిగా ఉన్నాడు. కొద్ది రోజుల క్రితమే జాగ్‌ జోద్‌ సింగ్‌ జైలు నుంచి బెయిల్‌ పై వచ్చారు.. జైల్లో ఇద్దరు పరిచయం కావడంతో బైక్‌లు చోరీ చేయాలని ప్లాన్‌ వేసుకున్నారు. సుదర్శన్‌నగర్‌లో రెక్కీ నిర్వహించి హాస్టల్‌ ముందు పార్క్‌ చేసిన బైక్‌లను గమనించి ఎత్తుకెళ్లారు. ఇద్దరు కలిసి చేసిన మొదటి కేసులోనే గచ్చిబౌలి పోలీసులకు పట్టుబడడం గమనార్హం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విలేకరుల సమావేశంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌ హబీబుల్లా ఖాన్‌, డీఐ రాజేష్‌ , ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

'కేసీఆర్‌ పాలనలో తెలంగాణ ఆర్థికంగా చితికిపోయింది'

గోల్కొండ: కేసీఆర్‌ పాలనలో తెలంగాణ ఆర్థికంగా చితికిపోయిందని కాంగ్రెస్‌ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్‌ నాయకులతో కలిసి రాష్ట్రంలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము చేయలేని కుల గణనను కాంగ్రెస్‌ ప్రభుత్వం చేయిస్తున్నందుకు బీఆర్‌ఎస్‌కు మింగుడు పడడం లేదన్నారు. పదేళ్లు ఇష్టారాజ్యంగా తెలంగాణను దోచుకున్న కేటీఆర్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న మంచి పనులకు మేధావులే కాకుండా ప్రజలు సైతం జై కొడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణను పదేళ్ల పాలనలో కేసీఆర్‌ అటకెక్కించారని ఆ పని కాంగ్రెస్‌ చేయిస్తున్నందున ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.చంద్రశేఖర్‌, రవీందర్‌, కిషన్‌, రాములు తదితరులున్నారు.

విద్యార్థుల ఆటాపాట అదుర్స్‌

ఘనంగా హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ 41వ వార్షికోత్సవం



హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో అలరించిన నృత్యప్రదర్శనలు

రాయదుర్గం: ఆటాపాటలతో విద్యార్థులు అబ్బురపరిచారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో క్యాంపస్‌ స్కూల్‌ 41వ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి క్యాంపస్‌లోని డీఎస్‌టీ ఆడిటోరియంలో నిర్వహించారు. వేడుకలను హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్‌ బీజేరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేత విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ చైర్మన్‌ ఆచార్య సంజయ్‌ సుబోధ్‌, వైస్‌చైర్మన్‌ బ్రహ్మానందరెడ్డి, ప్రిన్సిపల్‌ పి మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పింఛన్‌ పెంచాలని ఆందోళన



చార్మినార్‌: వికలాంగులకు రూ.6000, వృద్ధులు, వితంతువులకు రూ.4000ల ఫింఛన్లను వెంటనే ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు పంతంగి మంగమ్మ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు పాతబస్తీ బహదూర్‌పురా నియోజకవర్గం వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షురాలు చిన్నగండ్ల ప్రమీల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం వికలాంగులకు ఫించన్లు పెంచి ఇస్తామని మోసం చేసిందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నామన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఫించన్లను పంపిణీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి యాదగిరి నర్సింగ్‌రావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఇన్‌చార్జి తుంపల్లి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.